నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | SANGAREDDY




వర్గల్ మండలం మజీద్‌పల్లి సంపుహౌస్ వద్ద పేరుకుపోయిన మురుగు



సిద్దిపేట జనరల్ దవాఖానలో చూపించుకొని బయట మందులు కొనుక్కుంటున్న జ్వరబాధితుడు

# దవాఖానలకు సుస్తీ !

## ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా విజృంభిస్తున్న విషజ్వరాలు

- అరకొర వైద్యం.. దవాఖానల్లో మందుల కొరత
- సిద్దిపేట జిల్లా దవాఖానలో మందులు బయటకు రాస్తున్న వైద్య సిబ్బంది
- ప్రభుత్వ దవాఖానలను పట్టించుకోని కాంగ్రెస్ సర్కార్
- ఉన్నదంతా వైద్యానికి పెడుతూ అవస్థలు పడుతున్న ప్రజలు

సిద్దిపేట, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అనే రోజులు మళ్లీ వచ్చాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ దవాఖానలను పట్టించుకోవడం లేదు. కనీస అవసరాలు కూడా సమకూర్చడం లేదు. కొన్ని నెలలుగా ప్రభుత్వ దవాఖానల్లో మందులు లేవు. ఇవ్వడానికి మందులు లేక వైద్యులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలోని ఆయా ప్రభుత్వ దవాఖానలకు వెళ్తే బయటకు మందులు రాస్తున్నారని జ్వర బాధితులు వాపోతున్నారు. పేదల కోసం కట్టించిన ప్రభుత్వ దవాఖానల్లో మందులు లేకపోతే తాము ఎట్లా ..? తమ వద్ద డబ్బులు లేకనే ప్రభుత్వ దవాఖానలకు వస్తిమి..ఇక్కడేమో మందులు బయట తీసుకొమ్మని చెప్పవట్టిరి అని పేదలు ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో అప్పటి వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రతి దవాఖానలో పూర్తి స్థాయిలో మందులు అందుబాటులో ఉంచేవారు. దీంతో పేదలకు ఎంతో ప్రయోజనకరంగా ఉండేది. ఇవ్వాళ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత ఉంది. ప్రభుత్వ దవాఖానలను పట్టించుకునేవారు లేరు.

### ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత

సిద్దిపేట జిల్లా ప్రభుత్వ దవాఖానలో కొద్ది రోజులుగా మందుల కొరత ఉంది. మందులు లేక సిబ్బంది బయటకు రాస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వైరల్ జ్వరాలతో పాటు ఒళ్లు నొప్పులు, దగ్గులు, తల నొప్పి, వాంతులు ఇతర రోగాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. ప్రతి గ్రామంలో సగం మంది జనం జ్వరాలతోనే బాధపడుతున్నారు. పీహెచ్‌సీల్లో సరిపడా మందులు కూడా లేవు. ఆయా ప్రాథమిక కేంద్రాలు, జనరల్ దవాఖానల్లోనూ వైద్య సిబ్బంది కొరత ఉంది. జిల్లాలోని ప్రభుత్వ దవాఖానలకు వెళ్తే అంతంతమాత్రంగానే వైద్యం అందుతుందని రోగులు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన దామోదర రాజ నర్సింహ ఆరోగ్య మంత్రిగా ఉన్నారు. ఆయన ఉన్న జిల్లాలోనే ప్రభుత్వ దవాఖానల నిర్వాహణ ఇలా ఉంటే మిగతా జిల్లాలో ఏరకంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.





సిద్దిపేట జనరల్ దవాఖానలో ఓపీ కోసం భారీసంఖ్యలో క్యూకట్టి పేర్లు నమోదు చేయించుకుంటున్న రోగులు

### పెరుగుతున్న డెంగీ కేసులు

సిద్దిపేట ప్రభుత్వ జనరల్ దవాఖానలో రోజూ ఔట్ పేషెంట్లు 1,400 నుంచి 1,500 మంది రిజిస్టర్ చేసుకుంటున్నారు. దవాఖానలో ఐపీ 420 నుంచి 450 వరకు నమోదవుతున్నది. ప్రస్తుతం ఒక రోజుకు 100 ఫీవర్ కేసులు నమోదవుతున్నాయి. సీజనల్ వ్యాధులకు సంబంధించి 254 కేసులు దవాఖానలో అడ్మిట్ అయ్యారు. వీరిలో 27 డెంగీ కేసులు ఉన్నాయి. కొన్ని నెలలుగా దవాఖానలో వాటర్ ప్లాంట్లు పనిచేయక రోగులు మిషన్ భగీరథ నీళ్లే తాగుతున్నారు.వాటర్ ఫిల్టర్లు పనిచేయడం లేదు.సిద్దిపేట ప్రభుత్వ దవాఖానతోపాటు పీహెచ్‌సీల్లో ఇంజక్షన్లు, మందులు అందుబాటులో లేవు. సాధారణంగా చిన్న చిన్న రుగ్మతల కోసం ఇచ్చే మందులు లేకపోవడంతో రోగులు బయట కొనుక్కుంటున్నారు. ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 250 ఎంజీ , 500 ఎంజీ మందులతో పాటు ఇతర ఇంజక్షన్లను రోగులు బయట తీసుకొచ్చుకుంటున్నారు. ప్రధానంగా ప్రభుత్వ దవాఖానల్లో వివిధ రకాల యాంటీబయోటిక్స్, పిల్లల దగ్గు మందులు లేవు. అన్ని దవాఖానల్లో మందుల కొరత ఉంది. సంగారెడ్డి జిల్లా దవాఖానలో వర్షాకాలం ప్రారంభమైనప్పటి నుంచి 110 డెంగీ కేసులు నమోదు కాగా 100 చికెన్‌గున్యా, 90 వరకు టైఫాయిడ్ కేసులు ప్రభుత్వ దవాఖానల్లో నమోదయ్యాయి. ఇక ప్రైవేట్ దవాఖానల్లో ఆలెక్క అధికంగానే ఉంది. మెదక్ జిల్లాలో సైతం డెంగీ, టైఫాయిడ్ కేసులు విజృంభిస్తున్నాయి.

### లోపించిన పారిశుధ్యం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, ప్రభుత్వ దవాఖానల్లో జ్వర బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. దోమలు విపరీతంగా ఉండడంతో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలు విజృంభిస్తున్నాయి. గ్రామాలు, పట్టణాల్లో పారిశుధ్యం లోపించింది. వందల సంఖ్యలో డెంగీ కేసులు నమోదవుతున్నాయి. డెంగీతో మరణించిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. మోరీలు శుభ్రం చేయక దోమల బెడద ఎక్కువైంది. గ్రామాల్లో నిధులు లేక కార్యదర్శులు అప్పులు చేసి పెడుతున్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత గ్రామాలకు పైసా ఇవ్వలేదు. దీంతో కార్యదర్శులు చేతిలో డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నారు. బీఆర్ఎస్ హ యాంలో పల్లె ప్రగతి ద్వారా నిధులు ఇవ్వడం వల్ల గ్రామాలు పరిశుభ్రమైన వాతావరణంలో ఉన్నాయి. ఫలితంగా జ్వరాల సంఖ్య తక్కువగా నమోదైంది.

# ఆలేరుకు నీళ్లు.. చేర్యాలకు కన్నీళ్లు



శనివారం తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

- తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి ఆలేరుకు గోదావరి జలాలు
- కుడికాల్వ ద్వారా నీటిని విడుదల చేసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- చేర్యాల ప్రాంత చెరువులు నింపకపోవడంపై రైతుల అభ్యంతరం

చేర్యాల/కొమురవెల్లి, సెప్టెంబర్ 28: సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి ఆలేరుకు గోదావరి జలాలను శనివారం విడుదల చేయడంపై చేర్యాల ప్రాంత రైతుల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తమవుతున్నది. చేర్యాల ప్రాంతంలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలతో పాటు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలానికి గోదావరి జలాలు అందించి కరువును శాశ్వతంగా తరిమికొట్టేందుకు కొమురవెల్లి మండలంలోని తపాస్‌పల్లి –ఐనాపూర్ గ్రామాల మధ్య తపాస్‌పల్లి రిజర్వాయర్ నిర్మించారు. కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో రిజర్వాయర్ల నుంచి నీటిని కాల్వల ద్వారా చెరువులు నింపే కార్యక్రమానికి రాష్ట్రంలోనే ప్రథమంగా ఇక్కడ ప్రారంభించారు. దీంతో ఈ ప్రాంతంలో చెరువులు మత్తడి దూకి పంటల సాగు పెరిగింది. బీఆర్ఎస్ హ యాంలో ఏటా చెరువుల్లోకి గోదావరి జలాలు పంపింగ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపలేదు.ఇటీవల జనగామ ఎమ్మె ల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేయడంతో తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు నీటి విడుదల ప్రారంభించారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరకముందే శనివారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఆలేరు నియోజకవర్గంలోని ఆలేరు, బొందుగుల, కొలునుపాక, రాజపేట తదితర గ్రామాల్లో చెరువులు నింపేందుకు తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను సందర్శించారు. అక్కడి నుంచి మెయిన్ కాల్వ వద్ద గేట్‌వాల్ విప్పి జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని కొన్నె గ్రామ చెరువును పూర్తిస్థాయిలో నింపి అక్కడి నుంచి రాజపేటకు నీటిని తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.రిజర్వాయర్ నుంచి చేర్యాల, మద్దూరు ఉమ్మడి మండలాల చెరువులు పూర్తిస్థాయిలో నింపిన అనంతరం నీటి నిల్వలు ఉంటే ఆలేరు నియోజకవర్గానికి తీసుకుపోతే ఇక్కడ రైతులకు ఎలాంటి అభ్యంతరాలు లేవు. కానీ, ఎలాంటి అనుమతులు లేకుం డా తన అధికారాన్ని వినియోగించి ఇక్కడ చెరువుల నింపకముందే తన ప్రాంతానికి నీటిని తీసుకుపోతుండడంపై ఈ ప్రాంత రైతులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తపాస్‌పల్లి నీటిని కొండపాక, నంగునూరు తదితర మండలాలకు ఎలాంటి అనుమతులు లేకుండా తీసుకుపోయారని గొంతుచింపుకున్న నాటి ప్రతిపక్ష, నేటి అధికార పార్టీ నాయకులు దీనికి ఏం సమాధానం చెబుతారని ఈ ప్రాంత రైతాంగం ప్రశ్నిస్తున్నది. ఈ విషయమై సంబంధిత శాఖ డీఈ అంజయ్యను 'నమస్తే తెలంగాణ' ఫోన్‌లో వివరణ కోరగా.. చేర్యాల, కొమురవెల్లి మండలంలోని చెరువులు నింపామని, చేర్యాల పెద్ద చెరువు త్వరలో నింపుతామన్నారు. టెయిల్ ఎండ్‌లో ఉన్న కొన్నె చెరువు మత్తడి దూకితేనే బొందుగులు, అక్కడి నుంచి రాజపేటకు గోదావరి జలాలు వెళ్తాయన్నారు.

## చెరువులు నింపకుండా తరలిస్తే ఊరుకోం

### ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



తపాస్‌పల్లి రిజర్వాయర్ పరిధిలోని ప్రతిపాదిత ఆయకట్టు పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని చెరువులను గోదావరి జలాలతో నింపిన తర్వాతే ఇతర ప్రాంతాలకు నీటిని ఇవ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆలేరు ప్రాంతంలోని చెరువులు నింపేందుకు తపాస్‌పల్లి రిజర్వాయర్‌ను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సందర్శించి, అక్కడి నుంచి తన ప్రాంతానికి నీటిని తీసుకుపోయేందుకు మెయిన్ కాల్వల వద్ద ఉన్న గేట్ వాల్వ్‌ను కార్యకర్తలతో విప్పించడం సరికాదన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల్లోని చెరువులను గతంలో విధంగా మత్తడి పడే వరకు నింపాలని డిమాండ్ చేశారు. చేర్యాల ప్రాంత ప్రయోజనాల కోసం నిర్మించిన తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి జలాలు ఈ రైతులకు అందిన తర్వాత ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తే బాగుంటుందని, సకాలంలో వర్షాలు లేక ఇప్పటికే రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదుల అధికారులు తక్షణమే స్పందించి చేర్యాల ప్రాంత చెరువులు నింపాలని, లేనిపక్షంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు.

# పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీల చట్టాలపై అవగాహన కల్పించాలి
- ఎస్సీ, ఎస్టీల సమస్యలను సామరస్యంగా పరిష్కరించాలి
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- మెదక్‌లో జిల్లా ల్యాండ్, అట్రాసిటీ కేసుల సమీక్షా సమావేశం



మెదక్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మెదక్, సెప్టెంబర్ 28 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీల చట్టాలపై అవగాహన కల్పించాలని, ఎస్సీ,ఎస్టీల పెండింగ్ కేసులు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం మెదక్ కలెక్టరేట్‌లో ల్యాండు, అట్రాసిటీ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌తోపాటు సభ్యులు రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సీ అభివృద్ధి అధికారి శశికళ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలోనే ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదవుతున్నాయన్నారు. మెదక్ పట్టణంలో దుకాణా సముదాయాలు అర్హులైన లబ్ధిదారులకు కాకుండా బినామీల మీద ఉన్నాయని ఎస్సీ కార్పొరేషన్‌కు ఫిర్యాదు వచ్చిందన్నారు. వారం రోజుల్లో దానిపై పూర్తి నివేదిక అందజేయాలని సూచించారు. రామాయంపేట మండలం ఆర్.వెంకటాపూర్, శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామాల్లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమానించారని, హవేలీఘనపూర్ మండలం శమ్నాపూర్‌లో దళిత మహిళను వినాయకుడికి కొబ్బరికాయ కొట్టనివ్వలేదని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఎస్సీ,ఎస్టీల మీద దాడి చేసినప్పుడు స్టేషన్ బెయిల్ ఇవ్వవద్దని జిల్లా ఎస్పీకి సూచించారు. కేసు తీవ్రతను బట్టి శిక్ష పడే విధంగా చూడాలని, క్రిమినల్ కేసులు పెట్టి కోర్టుకు పంపాలని తెలిపారు. ప్రతి నెలా పౌర హక్కుల దినోత్సవం జరపాలన్నారు. మెదక్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి పునఃప్రతిష్టించాలన్నారు. ఎస్సీ,ఎస్టీలపై దాడులు అరికట్టాలని, బాధితులకు త్వరగా నష్ట పరిహారం అందించాలని సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. గౌతోజీగూడలో జరిగిన సంఘటనలో నిందితులను అరెస్టు చేయాలని, అక్కడ సహపంక్తి భోజనం ఏర్పాటు చేయాలన్నారు.కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ కులం, మతం పేరుతో ఎవరైనా దూషిస్తే మా దృష్టికి తీసుకురావాలన్నారు. పంచాయతీల్లో పౌర హక్కుల డే జరిపిస్తామన్నారు. కార్యక్రమం లో అధికారులు, ఆర్డీవోలు, మానిటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘం నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎస్సీ, ఎస్టీల పై జరుగుతున్న దాడులను అరికట్టాలని, తొలిగించిన అంబేద్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలని చైర్మన్‌ను డీబీఎఫ్ నేతలు కోరారు.

### నేటి బాలలే రేపటి పౌరులు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 28: నేటి బాలలే రేపటి పౌరులని ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మెదక్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. ఆయన వెంట కమిషన్ సభ్యులు రాంబాబునాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,అధికారులు ఉన్నారు.

## రేపటి నుంచి డీఎస్సీ ధ్రువపత్రాల పరిశీలన

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 28: ఉమ్మడి మెదక్ జిలాల్లో డీఎస్సీ 2008 పరీక్ష రాసి, 70:30 రిజర్వేషన్ ద్వారా ప్రభావితమైన బీఎడ్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన గడువు తేదీని పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ వెంకటేశ్వర్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాలను ఈ నెల 30 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు పరిశీలిస్తామన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన 292 మంది అభ్యర్థుల జాబితాను తెలంగాణ పాఠశాల విద్యా శాఖవెబ్ సైట్ www.schooledu.telanagana.gov.inలో పొందుపరిచిందన్నారు. ధ్రువీకరణ ఫారం కూడా ఇదే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. ఫారంతో పాటు గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించిన 1 నుంచి 7వ తరగతి బొనాఫైడ్, టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీఎడ్ ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు, లేటెస్ట్ కమ్యూనిటీ, క్యాస్ట్, దివ్యాంగ పత్రం, 2008 డీఎస్సీ హాల్ టికెట్ నెంబరు, ర్యాంకు కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో హాజరు కావాలని వివరించారు. అయితే పాఠశాల విద్యాశాఖలో కాంట్రాక్టు పద్ధతిన పనిచేసేందుకు అభ్యర్థి సమ్మతి తెలియజేయాల్సి ఉంటుందన్నారు.

## మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి



మిట్టపల్లి సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిషన్ చైర్మన్, సభ్యులు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 28 : మండల పరిధిలోని మిట్టపల్లిలో కేజీబీవీ, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలను రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు ఆనంద్, గోవర్ధన్‌రెడ్డి, జ్యోతి, భారతి శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ మేరకు విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, సరుకులను పరిశీలించి వారితో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం తీసుకుంటున్న చర్యలు, వైద్య పరీక్షల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కౌమార దశలో పౌష్టికాహారం తీసుకుంటేనే భవిష్యత్‌లో ఆరోగ్యంగా ఉంటారని, మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆయా ప్రిన్సిపాళ్లను ఆదేశించారు.

## నేడు మరసం 38వ వార్షికోత్సవం

### హాజరుకానున్న మాజీమంత్రి హరీశ్‌రావు, పలువురు కవులు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 28: సిద్దిపేట జిల్లా కేంద్రంలోని విపంచి కళానిలయంలో ఆదివారం మంజీరా రచయితల సంఘం(మరసం) 38వ వార్షికోత్సవ వేడుకలు జరుగనున్నాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతోపాటు ప్రముఖ సాహితీవేత్త, ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకుడు కే.శ్రీనివాస్, ప్రముఖ కవి కే.శివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్, జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ, మరసం అధ్యక్షుడు కే.రంగాచారితోపాటు పలువురు కవులు హాజరుకానున్నారు. వేడుకల్లో భాగంగా ఉదయం ప్రారంభసభ జరుగనుంది. మధ్యాహ్నం రెండోసమావేశంలో దాశరథి, ఆరుద్ర, బిరుదు రాజు రామరాజుల శత జయంతి వేడుకల సందర్భంగా ప్రత్యేక ప్రసంగాలు ఉండనున్నాయి. సాయంత్రం కవి సమ్మేళం జరగనున్నట్లు వేడుకల నిర్వాహకులు తెలిపారు.

**సాహితీ వికాసాన్ని దగ్గరికి చేర్చిన మరసం**

మెదక్ జిల్లా పేరు వినగానే ముఖ్యంగా వినిపించేది మంజీరా నది. మంజీరా నది పేరుతో పురుడు పోసుకున్న సాహిత్య, సాంస్కృతిక చేతన మంజీరా రచయితల సంఘం 1986 జూలై 20వ తేదీన మరసం మొట్ట మొదటి సభ సిద్దిపేటలో జరిగింది. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, పద్మభూషణ్ డా.సి. నారాయణరెడ్డి చేతుల మీదుగా మరసం సభ ప్రారంభమైంది. మంజీరా రచయితల సంఘం ముఖ్యంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో సాహిత్య, సాంస్కృతిక వికాసానికి దారులు చూపింది. కవిత్వమంటే ఎవరికీ అర్థంకాని భాషలో, భావంతో రాయడమనే సంప్రదాయిక సాహిత్యకారుల అభిప్రాయానికి భిన్నంగా మంజీరా రచయితల సంఘం ఆధునిక భావాలతో కవిత్వం, రాయడం, చదవడం మొదలు పెట్టింది. మరసం ఎన్నో సమకాలిన సమస్యలపై సభలు నిర్వహించడంతో పాటు సామాజిక ఉద్యమాలు నిర్వహించింది. మలి విడత తెలంగాణ ఉద్యమానికి ఎంతో తోడ్పడింది. తెలంగాణ భాషలో, యాసలో, తెలంగాణ స్పృహతో కవిత్వాన్ని, పాటల్ని రచించి ఉద్యమానికి ఊపిరి పోసిందని చెప్పవచ్చు.

## సాంఘిక బహిష్కరణలు పునరావృతం కావొద్దు

### రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య




గౌతోజిగూడెంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మనోహరాబాద్, సెప్టెంబర్ 28: సాంఘిక బహిష్కరణలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య ఆదేశించారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం గౌతోజిగూడెంలో శనివారం బాధితుల ఇంటికెళ్లి (నర్సమ్మ, చంద్రం, అర్జున్ కుటుంబ సభ్యులను)పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టం ముందు అందరూ సమానులేనన్నారు. ప్రధాన నిందితులను అరెస్ట్ చేయాలని పోలీసులను ఆదేశించారు. బాధిత కుటుంబానికి రక్షణ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు లక్ష్మీనారాయణ, శంకర్, రాంబాబునాయక్, దళిత బహుజనఫ్రంట్ జిల్లా అధ్యక్షుడు సంజీవ్, ప్రధానకార్యదర్శి నర్సింహ, డీబీఎఫ్ నేతలు స్వామి, వేణు పాల్గొన్నారు.

## సింగూరుకు కొనసాగుతున్న వరద

పుల్కల్, సెప్టెంబర్ 28: సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని బాగారెడ్డి సింగూరు ప్రాజెక్టుకు వరద కొనసాగుతున్నది. ఎగువ ప్రాంతాల్లో అధికంగా వర్షాలు కురుస్తుండటంతో ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరింది. వరద తీవ్రత పెరగడంతో రెండురోజులుగా నీటిపారుదల శాఖ అధికారులు 6, 11వ గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. శనివారం వరద కాస్త తగ్గుముఖం పట్టడంతో ఆరో గేటును అధికారులు మూసివేశారు.11వ గేటు ద్వారా నీటిని దిగువకు వదిలారు. ఇన్‌ఫ్లో 14,531 క్యూసెక్కులు రాగా, అవుట్ ఫ్లో 10,867 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు.11వ గేటు 1.50 మీటర్లు ఎత్తి 8,142 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 29.917 టీఎంసీలు ఉండగా, ప్రస్తుతం 29.768 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు వెల్లడించారు.



# వెంచర్‌పై అధికారుల కొరడా



సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నాగ్సాన్‌పల్లి శివారులో జేసీబీలతో వాగు ఆక్రమణలను తొలిగిస్తున్న అధికారులు

- నల్లవాగు ఆక్రమణల కూల్చివేత
- జేసీబీలతో అక్రమ నిర్మాణాల తొలిగింపు
- అధికారులకు సహకరించని వెంచర్ నిర్వాహకులు

సంగారెడ్డి, సెప్టెంబర్ 28: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం నాగ్సాన్‌పల్లి శివారులోని శిల్ప వెంచర్‌లో వాగును ఆక్రమించిన విషయం తెలిసిందే. దీంతో పలు తెలుగు దినపత్రికల్లో వచ్చిన వరుస కథనాలతో సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి దృష్టికి వెళ్లడం, సంబంధితశాఖల అధికారులు విచారణ చేసి ఆక్రమణలుంటే తొలిగించాలని ఆదేశాలు ఇచ్చారు. అధికారులు శుక్రవా రం వాగుకు ఇరువైపులా సర్వే చేసి గుర్తులు ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం నుంచి జేసీబీలను తీసుకువచ్చిన అధికారులు వాగు విస్తరణ కూల్చివేతలను ప్రారంభించారు. వెంచర్‌లో అధికారులు ఆక్రమణలు కూల్చివేస్తున్నా శిల్ప వెంచర్ యాజమాన్యం మాత్రం కార్యాలయానికే పరిమితమైంది. సదాశివపేట ఇన్‌స్పెక్టర్ మహేశ్‌గౌడ్ సిబ్బందిని వెంచర్‌కు పంపించి బందోబస్తు ఏర్పాటుచేశారు. వెంచర్‌లో ముగ్గురు కానిస్టేబుళ్ల నిఘాలో అక్రమ నిర్మాణాలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సంయుక్త దాడులతో తొలిగించారు.

### అధికారులకు సహకరించని వెంచర్ నిర్వాహకులు

ఈనెల 7న కురిసిన భారీ వర్షాలకు శిల్ప వెంచర్ నుంచి 65వ జాతీయ రహదారిపై వరద చేరి రోడ్డుపై ట్రాఫిక్ స్తంభించింది.ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, పేట పోలీస్ సిబ్బందితో వరదనీటిని పూర్తి గా తొలిగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వెంచర్‌లో ఆక్రమణకు గురైన వాగుతోనే వరద సమస్య వచ్చిందని గుర్తించిన అధికారులు వెంచర్ యాజమాన్యంతో మాట్లాడి ఆక్రమణకు గురైన వాగును విస్తరించాలని సూచించారు. అప్పట్లో వెంచర్ నిర్వాహకులు అధికారుల మాటలకు తలాడించి ఊరుకున్నారు. సర్వే లాండ్ ఏడీ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సంయుక్త సర్వే చేసి హద్దులు గుర్తించారు. ఈ విషయంపై వెంచర్ యాజమాన్యం జేసీబీలతో వాగుకు రెండు పక్కల విస్తరణ చేస్తామని చెప్పినా చేయలేదు. దీంతో అధికారులే జేసీబీలను తీసుకువచ్చి వాగు పనులు ప్రారంభించారు. సదాశివపేట తహసీల్దార్ సరస్వతి, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజినీర్ బాలగణేశ్, గిర్దావర్లు అనంతయ్య, గంగాధర్, ఇరిగేషన్ ఏఈ మహేశ్, మండల సర్వేయర్ ప్రశాంత్‌కుమార్ కూల్చివేత పనులను పర్యవేక్షించారు.

# కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. పగులుతున్న పైప్‌లైన్లు



సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలోని ఇస్నాపూర్ గురుకులం ఎదుట మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి వృథాగా పోతున్న నీరు

- నిత్యం మరమ్మతులతో తాగునీరు కరువు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పటాన్‌చెరు, సెప్టెంబర్ 28 : జాతీయ రహదారి విస్తరణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల మిషన్ భగీరథ పైప్‌లైన్ అనేక చోట్ల పగిలిపోతున్నది. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలంలో రింగ్‌రోడ్డు జంక్షన్ ముత్తంగి నుంచి లక్డారం గేటు వరకు మిషన్ భగీరథ విస్తరణ పనులు జరుగుతున్నాయి. విస్తరణ పనులు చేస్తున్న కాంట్రాక్టర్ జేసీబీలతోజాతీయ రహదారి పక్కన తవ్వకాలు చేస్తున్నాడు. ఇటీవల తవ్వకాల్లో ముత్తంగి గ్రామ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలింది. పెద్ద ఎత్తున తాగునీరు మురుగునీటిలో కలిసింది. మరో పక్క ఆరు రోజుల క్రితం ఇస్నాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఇస్నాపూర్ వద్ద జేసీబీ, ప్రొక్లెయినర్లతో జరిపిన తవ్వకాల్లో మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ పగిలిపోయింది. రెండు రోజులు తాగునీరు జాతీయ రహదారి పక్క నుంచి వృథాగా పారాయి. జాతీయ రహదారి విస్తరణకు వచ్చిన కాంట్రాక్టు సంస్థ సిబ్బందికి ఎక్కడ పైప్‌లైన్ ఉన్నది తెలియదు. మిష న్ భగీరథ పైప్‌లైన్లు ఎక్కడెక్కడి నుంచి వెళ్లాయి అనే విషయాలు తెలుపాల్సిన బాధ్యత మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులకు ఉంది. సమన్వయలోపం వల్ల మిషన్ భగీరథ పైప్‌లైన్లు పగిలిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మరమ్మతు చేయిస్తాం

జాతీయ రహదారిని విస్తరిస్తున్న కాంట్రాక్టర్‌కు మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎలా వెళ్లిందో అధికార బృందం ప్రత్యక్షంగా చూపించింది. అయినా కాంట్రాక్టర్ తాలుకు సిబ్బంది పైప్‌లైన్లను డ్యామేజ్ చేస్తున్నారు. మరమ్మతుకు సమయం పడుతుంది. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలిపి ఇక మీదట పైప్‌లైన్ పగులకుండా చూస్తాం.

– సుచరిత, మిషన్ భగీరథ డీఈ, సంగారెడ్డి జిల్లా